సాక్షి
చిత్తూరు
మంగళవారం, 25, ఏప్రిల్, 2023



వర్షం బీభత్సం

జిల్లాలో ఆది, సోమవారాల్లో కురిసిన భారీ వర్షానికి చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. ఓ మహిళ గాయపడింది. – 8లో



మలేరియా అంతం.. అదే పంతం

జిల్లాలో గత మూడేళ్లుగా మలేరియా కేసులు తగ్గుముఖం పట్టాయి. పారిశుద్ధ్య కార్యక్రమాలతో మలేరియా అదుపులోకి వచ్చింది. – 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	35	25
తిరుపతి	36	26
తిరుమల	30	21
గూడూరు	36	27
నగరి	36	26

న్యూస్‌రీల్

ఆస్పత్రిపై అసంతృప్తి

చిత్తూరురూరల్: జిల్లా ఆస్పత్రి సేవలపై కలెక్టర్ షణ్మోహన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్పత్రి అధికారులకు చురకలు పెట్టారు. సేవలు అందించడంలో ఎందుకు నిర్లక్ష్యమంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. అలాగే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల తీరుపై మండిపడ్డారు. ప్రోగ్రాం ఆఫీసర్లు సమావేశానికి ఎందుకు హాజరు కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఆ శాఖ అధికారులు బిక్క మొహం పెట్టారు. ఇకనైనా పద్ధతి మార్చుకుని, పనిచేయాలని కలెక్టర్ హెచ్చరించినట్లు తెలిసింది.

గురుకులంలో ప్రవేశానికి 28 వరకు గడువు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశానికి ఈ నెల 28వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని ఏపీ ఆర్‌జేసీ జిల్లా కోఆర్డినేటర్ వేణుగోపాల్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏపీ గురుకుల విద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించే 5, 6, 7, 8 తరగతులకు, జూనియర్ కళాశాలల్లో మొదటి సంవత్సరం ,డిగ్రీ కళాశాలల్లో మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఏపీఆర్‌జేసీ, ఏపీఆర్‌డీసీ ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 28 వ తేదీ లోపు ఈ పరీక్షలకు www.aprs.apcfss.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

మిగిలిన అభ్యర్థులకు 27న కౌన్సెలింగ్

చిత్తూరు కలెక్టరేట్ : డీఎస్సీ 1998 క్వాలిఫైడ్ అభ్యర్థులకు ఇటీవల నిర్వహించిన కౌన్సెలింగ్‌లో మిగిలిపోయిన వారికి ఈ నెల 27 కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వులు సోమవా రం డీఈఓ కార్యాలయానికి చేరాయి. ఆ ఉత్తర్వుల మేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 572 మంది క్వాలిఫైడ్ అభ్యర్థులకుగాను 534 మంది కౌన్సెలింగ్ హాజరయ్యారన్నారు. మిగిలిన 49 మందికి నిబంధనల ప్రకారం 27వ తేదీన కౌన్సెలింగ్ నిర్వహించి, పోస్టింగ్‌లు ఇవ్వాలని ఆ ఉత్తర్వుల్లో ఆయన పేర్కొన్నారు.

బోయకొండకు రూ.50.93 లక్షల ఆదాయం



హుండీ లెక్కింపులో పాల్గొన్న సిబ్బంది

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయానికి రూ.50.93 లక్షల ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ చంద్రమౌళి తెలిపారు. సోమవారం ఆలయంలో గంగమ్మ హుండీ లెక్కింపు నిర్వహించారు. హుండీలో భక్తుల సమర్పించిన కానుకలను లెక్కించగా నగదు రూ.50,93,859, బంగారం 42 గ్రాములు, వెండి 300 గ్రాములు వచ్చిందని ఈఓ పేర్కొన్నారు. ఈ ఆదాయం 43 రోజులకు వచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శశికుమార్, ఆలయ, బ్యాంకు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. కాగా బోయకొండపై ఉన్న రణభేరి గంగమ్మ ఆలయం వద్ద ఉన్న హుండీ లెక్కింపు ద్వారా రూ.33,676 ఆదాయం సమకూరినట్లు బోయకొండ గంగమ్మ ఆలయ ఈఓ చంద్రమౌళి పేర్కొన్నారు. ఈ ఆదాయాన్ని ఆలయ ప్రత్యేక ఖాతాలో జమ చేస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఇంటర్నెట్ కనెక్టివిటీ

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో ఇంటర్నెట్ కనెక్టివిటీని పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టనున్నారు. ఈ మేరకు రాష్ట్ర స్కూల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కమిషనర్ కాటమనేని భాస్కర్ సోమవారం ఉత్తర్వు లు జారీ చేశారు. ఆ ఉత్తర్వుల్లో ప్రభుత్వ ఉన్న పాఠశాలల్లో ఇంటర్నెట్ కనెక్టివిటీకి సంబంధించి పలు సూచనలు జారీ చేశారు. ఆ సూచనల మేరకు కసరత్తు చేపట్టాలని డీఈఓను ఆదేశించారు.

కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వేసవి సెలవుల సందర్భంగా వివిధ కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ అందించనున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ద్వారకనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఫండమెంటల్ నుంచి అడ్వాన్స్‌డ్ కోర్సుల వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కోర్సుల్లో చేరదలచిన వారు కనీస విద్యార్హత 7వ తరగతి ఉండాలని, ఈ అవకాశాన్ని విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, గృహిణులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఆసక్తి ఉన్న వారు తమ కళాశాలలోని మైక్రో ప్రాసెసర్ అండ్ నెట్‌వర్కింగ్ ల్యాబ్‌లో దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 99851 29995, 78999 51463ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.



సన్మానం పొందిన సర్పంచ్‌లు, అధికారులు, ఉద్యోగులు

పాలన వేగవంతం

- ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం
- పలువురికి అవార్డులు
- పాల్గొన్న జెడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు, కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కార్పొరేషన్: సచివాలయ వ్యవస్థతో పాలన వేగవంతం అయ్యిందని, గతంలో కంటే వేగంగా పాలన అందిస్తున్నామని జెడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం జెడ్పీ సమావేశ మందిరంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత వైఎస్సార్ విగ్రహం, గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. పీఎం ప్రసంగం ప్రత్యేక ప్రసారాన్ని ప్రదర్శించారు. జెడ్పీ ఛైర్మన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో గ్రామాలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు సేవలు వేగంగా స్థానికంగానే అందుతున్నాయన్నారు. దాదాపు 25 ఏళ్లుగా ఉద్యోగోన్నతులు పొందని ఎంపీడీఓలకు ఉద్యోగోన్నతులు వచ్చాయని గుర్తు చేశారు. సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా అందరూ కలిసి పనిచేద్దామన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా దాదాపు 12 శాఖలకు చెందిన సిబ్బంది క్షేత్రస్థాయిలో సేవలు అందిస్తున్నారని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. పంచాయతీరాజ్‌శాఖ ఏర్పడి 30 ఏళ్లు పూర్తియిందని జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. 31 పంచాయతీ సర్పంచ్‌లకు ఉత్తమ అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ పంచాయతీ పరిషత్ సభ్యులు అంజిబాబు, డీపీఓ లక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ శంకర్‌బాబు, పీఆర్ ఈఈలు రమణయ్య, చంద్రశేఖర్‌రెడ్డి. జెడ్పీటీసీ సభ్యులు, పలు శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

అవార్డులు అందుకున్న వారి వివరాలివీ..

పంచాయతీ	విభాగం, మండలం పేరు	సర్పంచ్ పేరు
ఎస్ఆర్‌పేట	చైల్డ్ ఫ్రెండ్లీ, చిత్తూరు	త్యాగరాజులు
నంగమంగళం	సెల్ఫ్ సఫిషియంట్, గుడిపాల	జయకోడి
డీఎం పురం	హెల్దీ, కార్వేటినగరం	ఇంజం తులసియాదవ్
కొత్తపల్లిమిట్ట	హెల్దీ , ఎస్ఆర్‌పురం	ఢిల్లెయ్య
ఎస్‌కేఆర్‌పురం	వాటర్ సఫిషియంట్, పాలసముద్రం	మహేష్‌బాబు
పెద్దకాలువ	ఉమెన్ ఫ్రెండ్లీ, జీడీనెల్లూరు	ఏకాంబరం
చిన్నకలికిరి	వాటర్ సఫిషియంట్, పెనుమూరు	తంగవేలు
కొమ్మరగుంట	ఉమెన్ ఫ్రెండ్లీ, వెదురుకుప్పం	ద్రాక్షాయణి
సొడిగానిపల్లె	చైల్డ్ ఫ్రెండ్లీ, గుడుపల్లె	సుశీల
కెనుమాకులపల్లె	ఉమెన్ ఫ్రెండ్లీ, శాంతిపురం	జయరాం
గొరివిమాకులపల్లె	సోషల్ సెక్యూర్డ్, రామకుప్పం	వాణి
బ్రహ్మదేవరచెరువు	హెల్దీ, కుప్పం	రాజేంద్రన్
నింద్ర	గుడ్ గవర్నెన్స్, నింద్ర	వసంత
కళియంబాకం	ఉమెన్ ఫ్రెండ్లీ, విజయపురం	విద్య
బుగ్గ అగ్రహారం	సోషల్ సెక్యూర్డ్, నగరి	రవికుమార్
గంగవరం	సోషల్ సెక్యూర్డ్, గంగవరం	చంద్రమ్మ
చపిడిపల్లె	ఉమెన్ ఫ్రెండ్లీ, బైరెడ్డిపల్లె	విజయ
వి.కోట	క్లీన్ అండ్ గ్రీన్, వి.కోట	లక్ష్మి
రాయల్‌పేట	క్లీన్ అండ్ గ్రీన్, పెద్దపంజాణి	అరుణ
సముద్రపల్లె	హెల్దీ, పలమనేరు	తిరుమలేష్
ఎర్రాతివారిపల్లె	పావర్టీ ఫ్రీ అండ్ ఎన్‌హాండ్స్ లైవ్ హుడ్, సదుం	కళావతి
ఏతూరు	పావర్టీ ఫ్రీ అండ్ ఎన్‌హాండ్స్ లైవ్ హుడ్, పుంగనూరు	జయప్రద
కామిరెడ్డిగారిపల్లె	చైల్డ్ ఫ్రెండ్లీ, సోమల	శ్రీదేవి
కల్లూరు	క్లీన్ అండ్ గ్రీన్, పులిచెర్ల	షుకూర్
దిగువపల్లె	సెల్ఫ్ సఫిషియంట్, చౌడేపల్లె	సోనీ
రొంపిచెర్ల	గుడ్ గవర్నెన్స్, రొంపిచెర్ల	ఇబ్రహీంఖాన్
తలుపులేనివారిపల్లె	సెల్ఫ్ సఫిషియంట్, పూతలపట్టు	రాధాకృష్ణనాయుడు
పాలకల	సోషల్ సెక్యూర్డ్, ఐరాల	వసంత
బంగారుపాళెం	గుడ్‌గవర్నెన్స్, బంగారుపాళెం	ఉమాదేవి
అరగొండ	చైల్డ్ ఫ్రెండ్లీ, తవణంపల్లె	మల్లుదొరై
వరదరాజుపల్లె	గుడ్‌గవర్నెన్స్, యాదమరి	పుష్పావతి

నకిలీలపై నిఘా

- వెబ్‌సైట్ల సూత్రధారుల కోసం అన్వేషణ
- 41 నకిలీ వెబ్‌సైట్లపై పోలీసులకు ఫిర్యాదు
- నకిలీ సైట్లపై భక్తులను అప్రమత్తం చేసిన టీటీడీ



సాక్షి, తిరుపతి: శ్రీవారి దర్శన టికెట్ల బుకింగ్ కోసం ఉపయోగించే నకిలీ వెబ్‌సైట్లపై టీటీడీ నిఘా పెట్టింది. అక్రమ సంపాదనే లక్ష్యంగా, కేటుగాళ్ల కదలికలపై దృష్టి పెట్టింది. వెబ్‌సైట్ల సూత్రధారులపై ఒక్కొక్కరిపైన చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా ఇప్పటికే 41 నకిలీ వెబ్‌సైట్లను గుర్తించి వారిపై టీటీడీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన శ్రీవేంకటేశ్వర స్వామివారి దర్శన టోకెన్లు, సమాచారం, విరాళాలు ఇచ్చేందుకు లక్షలాది మంది భక్తులు నిత్యం టీటీడీ వెబ్‌సైట్‌ను సందర్శిస్తుంటారు. ఈ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని కొందరు నకిలీ టీటీడీ వెబ్‌సైట్లను సృష్టించారు. భక్తులను నిలువునా దోచుకుంటున్నారు.

డిమాండ్‌తోనే నకిలీ వెబ్‌సైట్లు

పరిస్థితుల నేపథ్యంలో టీటీడీ పరిమిత సంఖ్యలోనే భక్తులను దర్శనానికి అనుమతించే అవకాశం ఉండడంతో డిమాండ్ పెరుగుతూనే ఉంది. శ్రీవారి ఆలయంలో నిత్యం ఆగమశాస్త్ర బద్ధంగా పూజా కైంకర్యాలు నిర్వహిస్తారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు 16 గంటలు శని, ఆదివారాల్లో 18 గంటల పాటు దర్శనానికి అనుమతిస్తారు. మహాలఘు విధానంలో భక్తులను అనుమతించినా గంటకు 4,500 మంది మించి దర్శనం చేసుకునే అవకాశం ఉండదు. స్వామివారికి నిర్వహించే ఆర్జిత సేవల్లో 150 మందికి మించి అనుమతించలేరు. దీంతో స్వామివారి దర్శనం కోసం, ఆర్జిత సేవల కోసం దేశవ్యాప్తంగా ఉన్న భక్తుల నుంచి డిమాండ్ ఉంటోంది. భక్తులకు కొంత ఉపశమనం కల్పించడానికి టీటీడీ ఆన్‌లైన్ విధానంలో దర్శన, సేవా టికెట్ల విక్రయాలను ప్రారంభించింది. నెలకు 3 లక్షల వరకు శ్రీవారి దర్శన టికెట్లు, 50 వేల వరకు సేవా టికెట్లు కేటాయిస్తోంది. వీటిని ఆన్‌లైన్‌లో విడుదల చేసిన నిముషాల వ్యవధిలో భక్తులు కొనుగోలు చేస్తున్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని కొందరు కేటుగాళ్లు నకిలీ వెబ్‌సైట్లు సృష్టించి భక్తులను నిలువునా దోచేస్తున్నారు. టీటీడీ పేరు చెప్పి అక్రమార్కులు ఆకర్షణీయమైన ప్రకటనలతో భక్తులకు వలవేస్తున్నారు. ఇలా పుట్టగొడుగుల్లా వెలుస్తున్న నకిలీ వెబ్ సైట్ల బెడద నుంచి భక్తులను రక్షించడానికి టీటీడీ పటిష్టమైన చర్యలకు పూనుకుంది. భక్తులు సులభంగా గుర్తించడానికి https://tirupatibalaji.ap.gov.in పేరుతో టీటీడీ భక్తులకు అందుబాటులోకి తీసుకొచ్చింది. అయితే దీన్ని ఆసరాగా చేసుకుని నకిలీలు రెచ్చిపోయారు. నకిలీ వెబ్‌సైట్లు సృష్టించి జేబులు నింపుకోవడం ప్రారంభించారు. దీనిపై పలుమార్లు టీటీడీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇలా ఇప్పటికే 40 వెబ్‌సైట్లపై ఫిర్యాదు చేయగా తాజాగా ఆదివారం మరో వెబ్‌సైట్ (https://tirupatibalaji-ap-gov.org) పై టీటీడీ ఫిర్యాదు చేసింది. అదే సమయంలో ఈ వెబ్‌సైట్‌పై విస్తృతంగా ప్రచారం చేసి, భక్తులను అప్రమత్తం చేసింది.

సూత్రధారులపై ప్రత్యేక నిఘా

నకిలీ వెబ్ సైట్ల సూత్రధారులపై టీటీడీ నిఘా పెట్టింది. టీటీడీ ఆలయ నమూనాలు, ఆనంద నిలయం, శిలాతోరణం, తిరుమల సప్తగిరుల ఫొటోలతో కూడిన నకిలీ వెబ్ సైట్‌లను క్రియేట్ చేయడంతో భక్తులు మోసపోతున్నట్లు గుర్తించారు. నకిలీ వెబ్‌సైట్‌ల సూత్రధారులపై చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు టీటీడీ సిద్ధమైంది.

ఈ-మార్కెటింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

చిత్తూరు అగ్రికల్చర్: స్వయం సహాయక సంఘాల సభ్యులందరూ ఈ-మార్కెటింగ్ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ప్రాజెక్ట్ డైరెక్టర్ తులసి తెలిపారు. సోమవారం జిల్లా సమాఖ్య సమావేశ భవనంలో జిల్లా సమాఖ్య సమావేశం నిర్వహించారు. మండల సమాఖ్యలు ఆర్థికాభివృద్ధిని సాధించి లాభాల బాటలో నడిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం ప్రతి మండల పరిధిలో ఆయా ప్రాంతాల వారీగా ఒక జీవనోపాధిని మెరుగు పరుచుకోవాలన్నారు. ఇప్పటికే ఆయా మండలాల వారీగా పలు జీవనోపాదులైన పంట ఉత్పత్తులు, చిరుధాన్యాలు, మిరపకాయలు, చింతపండు, టెంకాయ లాంటి ఉత్పత్తులను చేపడుతున్నారన్నారు. అలాగే మరిన్ని ఉత్పత్తులను ఆయా ప్రాంతాల వారీగా గుర్తించి, తద్వారా మంచి లాభాలు ఆర్జించేలా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ఇందుకోసం ఈ- మార్కెట్ విధానాన్ని సద్వినియోగం చేసుకుని ప్రతి సభ్యురాలు ఆర్థికాభివృద్ధిని సాధించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాల నియంత్రణకు ప్రతి డ్వాక్రా సభ్యురాలు కృషి చేయాలని జిల్లా ఆరోగ్య అధికారి గుణశేఖర్ పిలుపునిచ్చారు. 18 ఏళ్లలోపు బాలికలకు వివాహం చేయడంతో వారిలో ఎదుగుదల ఉండదన్నారు. అటువంటి సమయంలో గర్భం దాల్చితే మాతా శిశుమరణాలు చోటుచేసుకునే అవకాశం ఉందన్నారు. దీనిపై గ్రామీణ ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడంలో డ్వాక్రా మహిళలు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సమాఖ్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ తులసి

బలహీన వర్గాలను కించపరిస్తే సహించం



పలమనేరులో నారా లోకేష్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దళిత నేతలు



కుప్పం ఆర్టీసీ బస్టాండ్ వద్ద..

కుప్పం: రాష్ట్రంలోని బడుగు బలహీన వర్గాలను కించపరిచేలా వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని, రాష్ట్ర వ్యాప్తంగా తండ్రీకొడుకులకు బుద్ధి చెబుతామని ఎమ్మెల్సీ భరత్ హెచ్చరించారు. దళితులపై లోకేష్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం కుప్పం నియోజకవర్గంలోని దళిత సంఘాలు ఏకమై నల్లబ్యాడ్జీలు, నల్ల బెలూన్‌లతో నిరసన వ్యక్తం చేశారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద చంద్రబాబు, లోకేష్ దిష్టి బొమ్మలను దహనం చేశారు. దళితులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన లోకేష్‌పై కేసు నమోదు చేసి, అరెస్టు చేయాలని అర్బన్ పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఏ నాడు చంద్రబాబు బీసీ, ఎస్సీ, ఎస్టీలను గౌరవించిన పాపాన పోలేదన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సుధీర్, ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్, మున్సిపల్ వైస్ చైర్మన్ మునుస్వామి తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో తండ్రీ కొడుకులకు గుండుకొట్టించడం ఖాయం

పలమనేరు: వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు, లోకేష్‌కు ఎస్సీ, ఎస్టీ, బీసీలు గుండు కొట్టించడం ఖాయమని పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. పాదయాత్రలో దళితులను కించపరిచిన నారా లోకేష్ వ్యాఖ్యలపై స్థానిక ఎస్సీ, ఎస్టీ, బీసీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత సంఘాల నేతల ఆధ్వర్యంలో లోకేష్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమావేసి నివాళులర్పించి, మాట్లాడారు. టీడీపీ కార్యకర్తలను రెచ్చగొట్టి దళితుడైన మంత్రి ఆదిమూలం సురేష్ కార్యాలయంపై దాడి చేసిన ఘటన లోకేష్‌కే చెల్లిందన్నారు. దళిత నేత లు ఎరబల్లి శ్రీనివాసులు, పెద్దపంజాణి ఎంపీపీ రెడ్డెప్ప, కౌన్సిలర్ శ్యామ్ సుందర్‌రాజులు తదితరులు నారా లోకేష్ వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జైకుమార్, గోవిందు పాల్గొన్నారు.

రోజూ 60 వేల మందికి ఉపాధి కల్పించాలి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ప్రతి రోజూ 60 వేల మందికి తక్కువ కాకుండా ఉపాధి పనులు కల్పించాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో పలు శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జాబ్ కార్డులున్న ప్రతి ఒక్కరినీ ఉపాధి హామీ పనుల్లో భాగస్వామ్యం చేయాలన్నారు. వారికి కనీస వేతనం రూ. 272కు తక్కువ కాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భూగర్భ జల శాఖాధికారులు ఇచ్చే నివేదికల ఆధారంగా చేసుకుని ఏ ఏ పనులు ఏ ప్రదేశాల్లో కల్పించాలో నిర్ణయించాలన్నారు. తద్వారా ఆ పనులను వేగవంతంగా చేయించాలని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన మేరకు 88 లక్షల పని దినాలను చేరుకోవడానికి అంచెల వారీగా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఈ క్రమంలో ఈ మూడు నెలల్లో 44 లక్షల పనిదినాలకు తక్కువ కాకుండా చూడాలని, ఇందులో నెలకు 13 లక్షలు పని దినాలను కల్పించేలా ఉండాలన్నారు. ఉద్యానవన పంటలను ప్రోత్సహించాలని తెలిపారు. ఆ పంటలకు అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేస్తే ప్రభుత్వానికి పంపుతామన్నారు. ఈ సమీక్షలో డ్వామా పీడీ గంగాభవానీ, భూగర్భ జల శాఖ డీడీ గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

మలేరియా దినోత్సవ పోస్టర్ల ఆవిష్కరణ

చిత్తూరు రూరల్: నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం ప్రపంచ మలేరియా దినోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. డీఎం అండ్‌హెచ్‌ఓ జీ ప్రకాశం, డీఐఓ రవిరాజు, డీఎంఓ శ్రీనివాసులు, డీపీఎంఓ శ్రీనివాసరావు పోస్టర్లను ఆవిష్కరించి, కార్యక్రమ ఉద్దేశాన్ని వివరించారు.

నేడు అవగాహన ర్యాలీ..

ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని చిత్తూరు నగరంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు డీఎంఓ శ్రీనివాసులు తెలిపారు. ఉదయం 9 గంటలకు జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి నుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ జరుగుతుందన్నారు. అనంతరం ప్రతిజ్ఞ, మానవహారం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైద్యశాఖ అధికారులు

అప్పటికప్పుడే సమస్యలు పరిష్కరిస్తూ..

- కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం
- వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రజలు
- అర్జీలు స్వీకరించిన జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్వో రాజశేఖర్

చిత్తూరు కలెక్టరేట్ : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ షణ్మోహన్ సూచనల మేరకు వీడియో కాన్ఫరెన్స్ విధానం అమలు చేశారు. అప్పటికప్పుడే సమస్యల పరిష్కారానికి వీసీలో క్షేత్రస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి స్పందనలో వినతులు అందజేసేందుకు ప్రజలు విచ్చేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు స్పందన కార్యక్రమం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, డీఆర్వో రాజశేఖర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు.

స్పందనకు 281 అర్జీలు

కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 281 అర్జీలు వచ్చాయని డీఆర్వో రాజశేఖర్ అన్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెవెన్యూ శాఖకు సంబంధించి 179 అర్జీలు వచ్చాయన్నారు. హౌసింగ్ శాఖకు 13, పింఛన్లు, రేషన్ కార్డులకు 65, ఇతర శాఖలకు 24 అర్జీలు వచ్చాయని డీఆర్వో వెల్లడించారు.



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా క్షేత్రస్థాయి అధికారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు

అప్పటికప్పుడే వినతులు పరిష్కరించేలా....

స్పందన కార్యక్రమంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ విధానంలో జిల్లాధికారులు క్షేత్రస్థాయి అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించారు. ప్రజలు అందజేసిన సమస్యలకు సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా పరిష్కారం చూపాలన్నారు. అలసత్వం వహిస్తే కఠిన చర్యలుంటాయని కలెక్టర్, జేసీలు హెచ్చరించారు. అన్ని శాఖల జిల్లా అధికారులు స్పందన కార్యక్రమానికి హాజరయ్యారు.

వినతులు ఇలా..

- తాగునీటి కోసం కాలినడకన దూరప్రాంతానికి వెళ్లాల్సి వస్తోందని బంగారుపాళెం మండలం దిగువ ఎద్దులయ్యగారిపల్లె వాసులు స్పందనలో వినతిపత్రం అందజేశారు. వారి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు.
- తమ పూర్వీకుల భూమిని సర్వే చేసి తనకు అప్పగించాలని పెనుమూరు మండలం బొంతివంక గ్రామానికి చెందిన సుధాకర్ కోరారు. గ్రామంలో భూమి ఉన్న విషయం తనకు తెలియదన్నారు. అర్జీని క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని సర్వే శాఖ ఏడీని జేసీ ఆదేశించారు.

పోలీసుశాఖ స్పందనలో 21 ఫిర్యాదులు

చిత్తూరు అర్బన్: నగరంలోని జిల్లా పోలీసు శాఖ కార్యాలయంలో సోమవారం ఎస్పీ రిశాంత్‌రెడ్డి స్పందన కార్యక్రమం నిర్వహించి, ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఫిర్యాదులదారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మొత్తం 21 ఫిర్యాదులు రాగా చీటింగ్ 1, కుటుంబ తగదాలు 4, వేధింపులు 7, ఆస్తి తగదాలు 9 ఫిర్యాదులు అందాయని అధికారులు పేర్కొన్నారు.


అర్జీని పరిశీలిస్తున్న ఎస్పీ రిశాంత్‌రెడ్డి

కర్ణాటక మద్యం కేసులో ఒకరి అరెస్టు

గంగవరం: కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని గంగవరం పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి కథనం మేరకు.. మండలంలోని కురప్పల్లి గ్రామానికి చెందిన మునిరాజు తన ద్విచక్ర వాహనంలో రూ.3వేల విలువ చేసే టెట్రా ప్యాకెట్ల మద్యం తరలిస్తున్నాడు. సామలగడ్డ వద్ద పోలీసులు చేపట్టిన వాహనాల తనిఖీలో అతడు మద్యం తరలిస్తున్నట్టు గుర్తించి అరెస్టు చేశారు. అతనిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్టు ఎస్‌ఐ తెలిపారు.

గాయపడిన వృద్ధుడి మృతి

గంగవరం: రోడ్డు పక్కన నడిచి వెళుతున్న వృద్ధుడిని వెనుక నుంచి కారు ఢీకొన్న ఘటనలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి కథనం మేరకు.. మండలంలోని ఉల్లికుంట గ్రామానికి చెందిన హమీద్‌సాబ్(61) పెద్దఉగిణి గ్రామం వద్ద ఆదివారం సాయంత్రం నడిచి వెళుతుండగా చెన్నై వైపు నుంచి వేగంగా వచ్చిన కారు అతడిని వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో వృద్ధుడికి తీవ్రగాయాలయ్యాయి. పలమనేరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. ఈ మేరకు కారు డ్రైవర్ మనోహర్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు

డాక్యుమెంట్లు అందజేయండి


చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి జిల్లాలో ఇటీవల నియమితులైన డీఎస్సీ 1998 క్వాలిఫైడ్ టీచర్లు సంబంధిత డాక్యుమెంట్లు వెంటనే అందజేయాలన్నారు. ఈ మేరకు సోమవారం డీఈఓ విజయేంద్రరావు ఎంఈఓలను ఆదేశించారు. ఎంటీఎస్ ప్రాతిపదికన ఉద్యోగాల్లో చేరిన టీచర్ల జీతాల బిల్లులు పెట్టేందుకు సంబంధిత ఎంఈఓలకు డాక్యుమెంట్లు వెంటనే అందజేయాలని డీఈఓ తెలిపారు.

మలేరియా అంతం.. అదే పంతం

మలేరియా.. ఇదో ప్రాణాంతక జ్వరం.. ఆఫ్రికా దేశాల నుంచి దిగుమతైన ఈ మహమ్మారిని నిర్లక్ష్యం చేస్తే మెదడుకు సోకి ప్రాణాంతకం అవుతుంది. అందుకే ప్రభుత్వం మలేరియా అంతమే పంతంగా ముందుకు సాగుతోంది. మూడేళ్లుగా తరచూ ఫీవర్ సర్వే.. నిత్యం పారిశుద్ధ్య నిర్వహణ.. జ్వరపీడితులకు పరీక్షలు వెరసి.. మలేరియా భారీగా తగ్గుముఖం. ఫలితం ఏడాదిలో కేవలం రెండే కేసులు నమోదు. నేడు 'ప్రపంచ మలేరియా దినోత్సవం' సందర్భంగా ప్రత్యేక కథనం.

- జిల్లాలో తగ్గుముఖం పట్టిన కేసులు
- ఏటా రెండు కేసులు మాత్రమే నమోదు
- ప్రభుత్వ లక్ష్యం మేరకు పనిచేస్తున్న ఆరోగ్య శాఖ
- నేడు ప్రపంచ మలేరియా దినోత్సవం


దోమల నివారణ చర్యలు చేపడుతున్న అధికారులు(ఫైల్)



చిత్తూరు రూరల్: మలేరియాను అంతం చేయాలనే ప్రభుత్వ లక్ష్యం మేరకు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పనిచేస్తున్నారు. ఫలితంగా చిత్తూరు జిల్లాలో గత మూడేళ్లుగా మలేరియా కేసులు తగ్గుముఖం పట్టాయి. జిల్లాలో 50 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 8 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, నాలుగు ఏరియా ఆస్పత్రులు, ఒక జిల్లా ఆస్పత్రి, 14 అర్బన్ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. జిల్లాలో సమస్యాత్మక గ్రామాలు 42 ఉండగా అర్బన్ ప్రాంతాలే అధికంగా కనిపిస్తున్నాయి. చిత్తూరు నగరంలోని చవటపల్లె, మురకంబట్టు, ప్రశాంత్‌నగర్, మాపాక్షి, టెలిఫోన్ కాలనీ, ఎస్‌ఎస్ పురం, శంకరయ్యగుంట, పలమనేరు, కుప్పం తదితర ప్రాంతాల్లో దోమల వ్యాప్తి అధికంగా ఉన్నట్లు గుర్తించారు. ఈ ప్రాంతాల్లోనే మలేరియా, డెంగీ కేసులు నమోదవుతున్నాయని గుర్తించారు. ఇక్కడ ప్రతి నెలా అధికారులు దోమల నివారణకు చర్యలు చేపడుతున్నారు. దోమ తెరలు, మలాథియన్ పిచికారి చేస్తున్నారు. ఫలితంగా దోమల కట్టడితోపాటు మలేరియా కేసులు తగ్గుముఖం పట్టాయి. కరోనాకు ముందు ఉమ్మడి జిల్లాలో ఏటా 30 కేసులు దాటేవి. కరోనా నియంత్రణలో భాగంగా చేపట్టిన పారిశుద్ధ్య కార్యక్రమాలతో మలేరియా అదుపులోకి వచ్చింది. వరుసగా ఏటా రెండు కేసుల వంతున నమోదవుతున్నాయి.

జీరో కేసులు చేయాలని..

ఒకప్పుడు ప్రతి జ్వరపీడితుడికి రక్తపరీక్ష చేసి మలేరియా నిర్ధారించిన వైద్య ఆరోగ్యశాఖ ఇప్పుడు కేసులు తగ్గించే పనిలో పడింది. మూడేళ్లుగా సాధారణ జ్వరాలు, సీజనల్ జ్వరాల కేసులు మాత్రమే కనిపిస్తున్నాయి. కరోనా ప్రారంభం నుంచి ప్రభుత్వం ఫీవర్ సర్వే విధిగా చేపడుతోంది. ఈ సర్వేలో గుర్తించిన జ్వరపీడితులకు వైద్యాధికారులు పరీక్షలు చేసి, తగిన వైద్యం అందిస్తున్నారు. మలేరియా అనుమానిత లక్షణాలు కనిపిస్తే తక్షణం స్పందించి తగిన వైద్యం అందిస్తున్నారు. ఆ ప్రాంతంలో ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నారు. మలేరియా వ్యాప్తిపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. 2030 నాటికి జిల్లాను మలేరియా రహిత జిల్లా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని అధికారులు చెబుతున్నారు.

ఇంటి వైద్యం వద్దు.. ఆస్పత్రే ముద్దు

చాలా మంది జ్వరమంటే..ఇంటివైద్యంతో సరిపెట్టుకుంటున్నారు. చిల్లర దుకాణాల్లో దొరికే మాత్రలు మింగి మిన్నకుండిపోతున్నారు. ఇది మంచిది కాదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వ్యాధి లక్షణాలపై అవగాహన కలిగి ఉండాలంటున్నారు. ప్రభుత్వ వైద్యశాలలకు వెళ్లి పరీక్షలు చేయించాలని సూచిస్తున్నారు.

ప్రభుత్వ లక్ష్యం మేరకు పనిచేస్తున్నాం



వానాకాలం సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది. ఈ కాలంలో చిన్న నిర్లక్ష్యం కూడా చేయవద్దు. ముఖ్యంగా జ్వరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. తాగే నీటి విషయంలో కూడా చిన్న చిన్న విషయాలను పాటించినట్లయితే పెద్ద పెద్ద వ్యాధులకు దూరంగా ఉండవచ్చు. దోమల బారిన పడకుండా జాగ్రతలు తీసుకోవాలి. మలేరియా వ్యాప్తిని కట్టడి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఆ దిశగాపని చేస్తున్నాం. –శ్రీనివాసులు, జిల్లా మలేరియా అధికారి



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,200
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,500

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.76,000
రిటైల్ వెండి గ్రాము	రూ.78

చీటీల పేరుతో రూ.లక్షలు ముంచేశారు!

పలమనేరు: భార్యాభర్తలు చీటీల పేరిట డబ్బులు కట్టించుకుని, డబ్బులివ్వకుండా మోసం చేశారని పలమనేరులోని గంటావూరుకు చెందిన షణ్ముగం భార్య పర్వీన్ ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాలతో స్థానిక పోలీసులను కలిసినట్టు సోమవారం ఆమె తెలిపింది. వివరాల్లోకి వెళితే.. గంగవరం మండలం నలసానపల్లెకు చెందిన శంకరయ్య, జ్యోతి దంపతులు. వీరు పరిచయం ఉన్నవారి నుంచి చీటీలు నడుపుతున్నామని భారీగా లాభం ఉంటుందని నమ్మించి, చీటీలు నిర్వహిస్తున్నారు. వీరి మాటలను నమ్మి బాధితురాలు రూ.10 లక్షలు, రూ.5 లక్షల చీటీల్లో సభ్యురాలిగా చేరింది. ప్రతి నెల కంతునుగా 13 నెలలకు సంబంధించి రూ.8.85 లక్షలు కట్టింది. ఇటీవలే రెండు చీటీలు పూర్తి కావడంతో డబ్బులు అడిగింది. అయితే ఈ రోజు, రేపంటూ చీటీ నిర్వాహకులు కాలయాపన చేశారు. దీంతో బాధితురాలు వారి ఇంటివద్ద కెళ్లి తన డబ్బు చెల్లించాల్సిందేనంటూ నిలదీయడంతో వారు డబ్బులివ్వమంటూ ఆమెపై దౌర్జన్యానికి దిగారు. దీంతో తనకు న్యాయం చేయాలంటూ బాధితురాలు ఎస్పీని ఆశ్రయించింది. ఆయన ఆదేశాలతో స్థానిక పోలీసులవద్ద కొచ్చింది. తనలాగా ఎవరూ అనధికారిక చీటీల జోలికెళ్లి మోసపోకూడదనే తలంపుతో మహిళనైనప్పటికి ధైర్యం చేసి న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించినట్టు తెలిపింది.

బైక్‌లు ఢీకొని వ్యక్తి మృతి

చంద్రగిరి(తిరుపతి రూరల్): మదనపల్లి–తిరుపతి జాతీయ రహదారిపై రెండు బైక్‌లు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు, తిరుపతి రూరల్ మండలం ఓటేరుకు చెందిన వేలాయుధం తన ద్విచక్ర వాహనంపై భాకరాపేట నుంచి తిరుపతికి బయల్దేరారు. అదే సమయంలో మంగళంపేట గడ్డంవారిపల్లెకు చెందిన మోహన్‌రెడ్డి మరో బైక్‌పై తిరుపతికి వస్తున్నాడు. రంగంపేట సమీపంలోని బ్రాందీ షాప్ వద్ద వేలాయుధం బైక్‌ను వెనక నుంచి మోహన్‌రెడ్డి ఢీకొన్నాడు. ఈ ఘటనలో మోహన్‌రెడ్డి మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

గంగమ్మ జాతర పోస్టర్ల ఆవిష్కరణ


గంగమ్మ జాతర పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: పట్టణంలో మేనెల 14,15,16 తేదీల్లో జరిగే తిరుపతి గంగమ్మ జాతర పోస్టర్లను ఆలయ కార్యవర్గం, ప్రజాప్రతినిధులు, నాయకులతో కలసి స్థానిక ఎమ్మెల్యే సోమవారం ఆవిష్కరించారు. ఈ సారి జాతరని వైభవంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నరేష్, వైస్ చైర్మన్ రెడ్డెప్పరెడ్డి, డైరెక్టర్లు మంజుల, కృష్ణవేణి, వేణుగోపాల్, ప్రసాద్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర, చెంగారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

జాతరను పటిష్టంగా నిర్వహించాలి

గంగమ్మ జాతరను పటిష్టంగా నిర్వహణపై స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం పలు శాఖల అధికారులతో మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్, ఆలయ కమిటీ సభ్యులతో కలసి సమావేశం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న సీఐ చంద్రశేఖర్, అగ్నిమాపకశాఖ అధికారులు, దేవదాయ, ట్రాన్స్‌కో అధికారులు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు.

వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జిల నియామకం

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ అనుబంధ విభాగమైన ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జిలను నియమిస్తూ పార్టీ కార్యాలయం ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ మేరకు నెల్లూరు, వైఎస్సార్, తిరుపతి జిల్లాలకు తిరుపతికి చెందిన విశ్రాంత ఏఎస్పీ ఎన్‌పీ దేవదానం, చిత్తూరు, అనంతపురం, శ్రీసత్యసాయి, అన్నమయ్య జిల్లాలకు అనంతపురం జిల్లాకు చెందిన జె.రామాంజనేయులను నియమించారు. వీరు పార్టీ బలోపేతానికి కృషి చేస్తారన్నారు.


దేవదానం


రామాంజనేయులు

కారుణ్య నియామక పత్రం అందజేత

రొంపిచెర్ల: అనారోగ్యంతో మృతి చెందిన పంచాయతీ కార్యదర్శి సుబహాన్ భార్యకు సాదీదాకు కారుణ్య నియామక పత్రాన్ని జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి సోమవారం అందజేశారు. సుబహాన్ అనారోగ్యంతో 2022 సంవత్సం మే 20వ తేదీన మృతి చెందాడు. తమకు ఇద్దరు పిల్లలున్నారని, తమను ఆదుకోవాలని మృతుని భార్య సాదీదా రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి మొర పెట్టుకుంది. దీంతో మంత్రి కారుణ్య నియామకం కింద రొంపిచెర్ల పంచాయతీ కార్యాలయంలో అటెండర్‌గా ఉద్యోగం కల్పించారు. ఈ మేరకు మృతుని భార్య సాదీదా సోమవారం కారణ్య నియామక పత్రం అందజేశారు. దీంతో ఆమె రొంపిచెర్ల పంచాయతీలో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇబ్రహీంఖాన్, కార్యదర్శి నాగరాజ పాల్గొన్నారు.


నియామక పత్రాలు అందుకుంటున్న సాదీదా

కొనసాగుతున్న గజ దాడులు

సోమల: మండలంలో ఏనుగుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. ఆదివారం రాత్రి పత్రపల్లెకు చెందిన శివారెడ్డి టమాట, అరటి పంటలు, మామిడి చెట్లు, బిందు సేద్యం పరికరాలను ధ్వంసం చేశాయి. అలాగే పెద్ద ఉప్పరపల్లెకు చెందిన రఘు టమాట, అరటి, రాగి పైరుగు ఏనుగులు నాశనం చేశాయి.


ఏనుగులు ధ్వంసం చేసిన టమాట

కరెంట్ షాక్‌తో ట్రాక్టర్ డ్రైవర్ దుర్మరణం

కుప్పంరూరల్: కరెంట్ షాక్‌కు గురై ట్రాక్టర్ డ్రైవర్ దుర్మరణం పాలైన సంఘటన కుప్పం మండలం చెక్కునత్తం పంచాయతీ బాబునగర్ వద్ద సోమవారం ఉదయం చోటు చేసుకుంది. సీఐ శ్రీధర్ కథనం మేరకు.. మల్లానూరు గ్రామానికి చెందిన నారాయణస్వామి బాబునగర్ వద్ద కొంత పొలం కొనుగోలు చేసి, వ్యవసాయం చేస్తున్నాడు. ఇతని వద్ద గరిగచీనేపల్లి పంచాయతీ వేపనపల్లెకు చెందిన సుబ్రమణ్యం (40) డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి వీచిన గాలివానకు నారాయణస్వామి పొలంలోని విద్యుత్ తీగ తెగిపడింది. దీన్ని జాయింట్ చేసే సమయంలో ప్రమాదవశాత్తు కరెంట్ షాక్‌కు గురైన సుబ్రమణ్యం అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సుబ్రమణ్యం మృతితో వేపనపల్లెలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ శ్రీధర్ తెలిపారు.

వర్షం బీభత్సం


రామకుప్పం: ధ్వంసమైన బీన్స్ పంట


నగరి: రోడ్డుపై పడిన చెట్టు

రామకుప్పం: మండలంలో సోమవారం గాలి వాన బీభత్సం సృష్టించింది. బందార్లపల్లె, గొరివిమాకులపల్లె, పంద్యాలమడుగు పంచాయతీల్లో పెనుగాలులతో కూడిన వడగండ్ల వాన కురిసింది. ఈ వర్షానికి మామిడి, టమాట, బీన్స్, స్వీట్ కార్న్, వరి, రాగి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. కొటారుగడ్డ గ్రామం వద్ద 3 విద్యుత్ స్తంభాలు కూలి, సరఫరాకు అంతరాయం ఏర్పడింది. బోయనపల్లి చేన్లు సమీపంలోని పశువుల షెడ్డు పైకప్పునకు ఉన్న సిమెంటు రేకులు ఎగిరి పక్క పొలంలోని కాంతమ్మ(42)పై పడ్డాయి. దీంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు ఆమెను కుప్పం ఆస్పత్రికి తరలించారు.


గాయపడిన కాంతమ్మ

నగరి : మండలంలో ఆదివారం రాత్రి ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీగా వర్షం కురిసింది. ఈ వర్షానికి పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. గాలులకు పలు ప్రాంతాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. దీంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. మామిడి తోపుల్లో గాలులకు కాయలు రాలిపోయాయి. మామిడి రైతులు తీవ్ర ఆవేదనకు లోనయ్యారు.

అయ్యా.. ఊరినే ఖాళీ చేయమంటున్నారు!

పలమనేరు: ప్రభుత్వం ఇంటి పట్టాలను మంజూరు చేయగా అందులో పక్కా ఇళ్లను కట్టుకుని బతుకుతున్న తమ ఇళ్లను ఖాళీ చేయాలని గ్రామమంతా తమదేనని ఇద్దరు వ్యక్తులు బెదిరిస్తున్నారని గంగవరం మండలం మామడుగు పంచాయతీ అప్పిశెట్టి పల్లెకు చెందిన నలభై కుటుంబాల వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం స్పందనలో వారు స్థానిక ఆర్డీఓ శివయ్యకు అర్జీ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్తులు చంద్రప్ప, చెంగారెడ్డి, కృష్ణారెడ్డి, భాస్కర్, శివగోవిందు, హేమకుమార్ రెడ్డి మాట్లాడుతూ తమ గ్రామంలోని సర్వే నంబర్ 489/1లో 2.38 ఎకరాలుందన్నారు. ఇందులో ప్రభుత్వం గ్రామస్తులకు ఇళ్ల పట్టాలను మంజూరు చేసిందన్నారు. దీంతో పక్కా ఇళ్లను నిర్మించుకున్నామని తెలిపారు. ఇన్నేళ్ల తర్వాత తమ గ్రామానికే చెందిన చౌడిరెడ్డి, వరదారెడ్డి అనే వ్యక్తులు ఈ గ్రామం మొత్తం తమ పూర్వీకులది కాబట్టి ఇళ్లను ఖాళీ చేయాలని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే వీరు పలువురు రైతులకు చెందిన భూములను రెవెన్యూ అధికారుల అండతో పట్టాపాసు పుస్తకాలను పొంది బ్యాంకుల్లో తనఖా పెట్టారని తెలిపారు. దీనిపై విచారణ చేసిన అధికారులు ఆ సర్వే నంబర్లను హోల్డ్‌లో పెట్టారని, ఇలాంటి మోసపూరితమైన వీరు ఇప్పుడు ఏకంగా గ్రామాన్నే వారి పేరిట రాసుకున్నారని ఆరోపించారు. దీని వెనుక సూత్రధారులైన అప్పటి రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై విచారణ జరిపి తప్పకుండా చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ వారికి హామీ ఇచ్చారు.


పలమనేరు ఆర్డీఓకు వినతిపత్రం సమర్పించడానికి వచ్చిన అప్పిశెట్టిపల్లి వాసులు

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

పూతలపట్టు: ద్విచక్ర వాహనాలను చోరీ చేసే వ్యక్తిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఎస్‌ఐ హరిప్రసాద్ కథనం మేరకు.. నెల్లూరు జిల్లా ముదివర్తిపాళెనికి చెందిన దొడ్ల సంతోష్ గతంలోనే పలు ద్విచక్ర వాహనాల చోరీ కేసులో నిందితుడిగా జైలులో ఉండి బెయిల్‌పై బయటికి వచ్చి, పూతలపట్టులోని ఐటీసీలో మేస్త్రీగా జీవనం సాగిస్తున్నాడు. పూతలపట్టులో నివాసం ఉంటూ తిమ్మిరెడ్డిపల్లె, పి.కొత్తకోట, పూతలపట్టులో 3 ద్విచక్ర వాహనాలను చోరీ చేయడంతో పోలీసులు అతని అరెస్టు చేశారు. నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు.


నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

సంస్కృత అష్టావధానంలో ప్రతిభ చాటిన భరత్ శర్మ


అష్టావధానం నిర్వహిస్తున్న భరత్ శర్మ

తిరుపతి కల్చరల్: రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం వేదికగా మొట్టమొదటి సారి సంస్కృత భాషలో సోమవా రం అష్టావధానాన్ని నిర్వహించి ఉప్పలధడియం భరత్ శర్మ ఉభయ భాషల్లోను తన పాండిత్య ప్రతిభను చాటుకున్నారు. ఆయన ఇప్పటి వరకు తెలుగు భాషలో 46 అష్టావధానాలు, ఒక శతావధానాన్ని నిర్వహించారు. రాష్ట్రీయ సంస్కృత వర్సిటీ వార్షికోత్సవంలో భాగంగా కులపతి ఆచార్య గుళ్లపల్లి శ్రీరామకృష్ణమూర్తి ఆధ్వర్యంలో సంస్కృత అష్టావధానం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్కృతంలో పృచ్ఛకులు అడిగిన ప్రశ్నలకు భరత్ శర్మ సమాధానాలిచ్చారు. వర్సిటీ కులపతి మాట్లాడుతూ అంతరించిపోతున్న అష్టావధాన కళను వెలుగులోకి తెస్తున్న యువ శతావధాని ఉప్పలధడియం భరత్ శర్మ నేటి యువతరానికి మార్గదర్శకమన్నారు. అష్టావధానానికి అధ్యక్షుడిగా ప్రొఫెసర్ కేఎస్.రాజగోపాలన్ వ్యవహరించగా, పృచ్ఛకులుగా సోమనాథదాస్, భరత్‌భూషణ్, సీహెచ్.నాగరాజు, దత్తాత్రేయ శర్మ, సీతారాం శర్మ, ఎంజీఎస్ నందనరావు, ఎస్.వైష్ణవి, గంగిరెసెట్టి లక్ష్మీ నారాయణ వ్యవహరించారు.